
కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

# ప్రభుత్వం ఫ్లాప్

- ధాన్యం కొనుగోళ్లలో అధికారుల తాత్సారం
- కేంద్రాలలో రోజుల తరబడి రైతుల నిరీక్షణ
- అకాల వర్షాలకు దిగుబడి తడిసిపోతోంది
- నిబంధనల ముసుగులో కోతలు పెడుతున్నారు
- ప్రభుత్వం స్పందిచకపోతే ఆందోళన ఉధృతం
- 'రైతు గోస బిజెపి భరోసా'లో పార్టీ చీఫ్ రాంచదర్ రావు

**కుల్కచర్ల, మే 25, ప్రభాతవార్త :** తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచదర్ రావు మండిపడ్డారు. రైతు గోస భరోసా యాత్రలో భాగంగా జిల్లా కన్వీనర్ కరనం ప్రహ్లాద్‌రావు అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమాస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పివిఆర్ ఫంక్షహాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల పేరుతో రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ పాలనను ప్రజలు చూశారు...ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా అదేబాటలో కొత్త ప్రాజెక్టుల పేరుతో రూ. లక్షల కోట్లకు డిపీఆర్‌లు తయారు చేస్తూ, సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రైతులను మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. వరి కొనుగోలు కేంద్రాలలో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, తేమ, రంగు మారిన ధాన్యం నిబంధనల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాకపోవంతో వర్షాలకు తడిసి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి నేడు రైతును మోసం చేశారని విమర్శించారు. ప్రతి ఎకరానికి రూ. 7500 ఇస్తామని చెప్పి అ హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయటం ద్వారా రైతు గోస బిజెపి భరోసా ఇస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసన మండలి పక్ష నేత ఏవిఎన్ రెడ్డి, ఎంపిలు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డికె ఆరుణ, ఇటల రాజేందర్ , బాధవనేని రఘునందన్ రావు, ఎమెల్యేలు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, పాల్లయి హరిశ బాబు, ధన్‌పాల్ హరిశ బాబు, ధన్‌పాల్‌పూర్య నారయణ గుప్త, రామరావు పటేల్, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఆంజిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మఇ నర్సయ్య,బిజెపి జిల్లా నాయకులు ఆయా మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

- ప్రకృతి కోపానికి కుదేలైన మాడ్గుల రైతులు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం కుప్పలు
- అన్నదాతకు భారీ నష్టం
- కూలిన చెట్లు, స్తంభాలు..
- నిలిచిన రాకపోకలు
- చీకట్లోనే పలు గ్రామాలు
- పెనుగాలుల బీభత్సానికి ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు..

# అమ్మ వానదేవుడో.. కొంప ముంచినావురో!

మాడ్గుల మండలంలో సోమవారం సాయంత్రం కురుసిన భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో వాన పడటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బలమైన గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలి పలు గ్రామాలు అంధకారంలో మునిగిపోగా , ప్రధాన రహదారులపై రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ముఖ్యంగా నాగిళ్ల కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తెచ్చిన వరి ధాన్యం టార్పాలిన్ కవర్లు వేసినా లాభం లేకుండా భారీ వర్షానికి తడిసి ముద్దవడంతో.. సాగు ఖర్చులు, పెట్టుబడులు కోల్పోయిన అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు.

**మాడ్గుల, మే 25, ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బలమైన ఈదురుగాలుల ధాటికి పలు గ్రామాల్లో చెట్లు నేలకూలగా, విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. ముఖ్యంగా రైతులు,వాహనదారులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని నాగిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యం భారీ వర్షానికి తడిసి ముద్దైంది. గత కొంది రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు సాయంత్రానికి ఆకస్మికంగా కురిసిన వానతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ధాన్యాన్ని కాపాడేందుకు రైతులు టార్పాలిన్ కవర్లు, ప్లాస్టిక్ షీట్లు


నేలకొరిగిన భారీ వృక్షం.. తెగి పడిన విద్యుత్ వైర్లు



వేయడానికి ప్రయత్నించినప్పటికీ గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెద్ద మొత్తంలో వరి తడిసిపోయింది. ఇప్పటికే సాగు ఖర్చులు,పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వాన మరింత భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగిళ్ల, అవురుపల్లి, మాడ్గుల పరిసర గ్రామాల్లో ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కూడా తెగిపడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రాత్రి సమయానికి గ్రామాలు అంధకారంలో మునిగిపోయాయి.

మిగతా 2లో


నాగిళ్ల కొనుగోలు కేంద్రంలో తడిసిపోయిన ధాన్యం కుప్పలు

మేడిగడ్డలో కూలిపోయిన ఇందిరమ్మ ఇంటి గోడ

కుప్పకూలిన విద్యుత్ స్తంభం

శంకర్‌కొండతండాలో గాలికి కొట్టుకుపోయిన ఇంటిపైకప్పు

చెట్టుపడిపోవడంతో నిలిచిపోయిన వాహనాలు


నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న ఏఓ లావణ్య, ఎస్ఐ వేణుకుమార్

# డూప్లికేటుగాళ్లు

- రైతులను దగా చేయటానికి నీటూర్ కేంద్రంగా స్కెచ్
- నకిలీ పత్తి విత్తనాల గుట్టు రట్టు చేసిన వ్యవసాయశాఖాధికారి లావణ్య
- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.7.50 లక్షల విలువైన 375 కిలోల విత్తనాలు స్వాధీనం

**దౌల్తాబాద్, మే 25, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం నీటూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ నకిలీ పత్తి విత్తనాల ముఠాను వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిణి (ఎఓ)పి.లావణ్య వెల్లడించారు. సోమవారం ఉదయం సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో అందిన నమ్మదగిన సమాచారం మేరకు..ఏఓ లావణ్య తన సిబ్బంది,దౌల్తాబాద్ పోలీసులతో కలిసి నీటూర్ గ్రామానికి చెందిన తలారి వేణు(34) ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో వేణు ఇంటి వద్ద మరో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా,వేణు ఇంటి లోపల ఎలాంటి అనుమతులు లేని 15 బస్తాలలో 375 కిలోల(3.75 క్వింటాళ్లు) నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయని, వీటి మొత్తం విలువ సుమారు రూ.7,50,000 (ఏడు లక్షల యాభై వేల రూపాయలు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

అధికారులు సదరు విత్తనాలకు సంబందించిన పత్రాలు, పర్మిషన్లు చూపించాలని కోరగా వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని తేలింది. పోలీసుల విచారణలో పట్టుబడిన మిగతా ఇద్దరు వ్యక్తులను కర్ణాటక రాష్ట్రం, చందాపూర్ గ్రామానికి చెందిన పానకాల సురేష్(40), అదే రాష్ట్రం, సేడం తాలూకా, చందాపూర్ మండలం,పాకాల గ్రామానికి చెందిన కళ్యాణ్‌వీరేష్(45)లు గా గుర్తించారు. వీరంతా కలిసి అమాయక రైతులను మోసం చేసి, ఎక్కువ లాభాలు గడించడమే లక్ష్యంగా ఈ నకిలీ విత్తనాలను విక్రయించడానికి సిద్ధం చేసినట్లు విచారణలో అంగీకరించారు. పంచుల సమక్షంలో లభించిన 15 బస్తాల నకిలీ విత్తనాలను సీజ్ చేసి, రైతుల జీవితాలతో ఆటలాడుతున్న ఈ ముగ్గురిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఏఓ లావణ్య దౌల్తాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశామన్నారు. దళారులను నమ్మి లూజ్, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన అధికారిక డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరిగా పక్కా క్యాష్ బిల్లు తీసుకోవాలని, పంట చేతికి వచ్చే వరకు విత్తన సంచులు భద్రపరుచుకోవాలని ఏఓ లావణ్య రైతులకు సూచించారు.

## ప్రజావాణికి వైద్య సిబ్బంది డుమ్మా!

- వికారాబాద్ కలెక్టర్ సీరియస్
- షోకాజ్ నోటీసులు జారీ..!
- పునరావృతమైతే వేటు తప్పదని వార్నింగ్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా నిరక్ష  ్యంగా డుమ్మా కొట్టిన అధికారులపై వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేసి, విధులకు అనధికారికంగా గైర్హాజరైన డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆనంద్, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్, 108 కోఆర్డినేటర్ బి.రఘురాంలకు కలెక్టర్ గట్టి షాక్ ఇస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజల పట్ల, ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ఇంతటి నిరక్ష  ్య వైఖరిని సహించేది లేదని స్పష్టం చేసిన కలెక్టర్, విధులకు ఎందుకు హాజరు కాలేదో తక్షణమే లిఖితపూర్వక వివరణ సమర్పించాలని సదరు అధికారులను ఆదేశించారు. ఒకవేళ నిర్ణీత సమయంలోగా సరైన వివరణ ఇవ్వనట్లయితే, ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండానే అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం సస్పెన్షన్‌తో కూడిన కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ నోటీసు ద్వారా అత్యంత ఘాటుగా హెచ్చరించారు. వివరణ ఇవ్వడంలో జాప్యం జరిగినా తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయని తేల్చి చెప్పారు.



అంతేకాకుండా, ప్రజావాణి వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలకు హాజరు కాకుండా నిరక్ష  ్యం వహించే ఇటువంటి ధోరణి మళ్లీ పునరా వృతమైతే, సదరు అధికారులకు విధుల్లో కొనసాగడానికి లేదా పని చేయడానికి ఏమాత్రం ఆసక్తి లేదని భావించాల్సి ఉంటుందని, ఇదే విషయాన్ని తదుపరి చర్యల కోసం నేరుగా ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని కలెక్టర్ దీపక్ తివారి హెచ్చరించారు. కలెక్టర్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో జిల్లాలోని ప్రభుత్వ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# పోషకాహార మేళా ద్వారా ఆరోగ్య చైతన్యం

*మహిళా వారోత్సవాలనూ జయప్రదం చేయండి*

*అంగన్వాడీలకు కలెక్టర్ నారాయణ రెడ్డి దిశానిర్దేశం*

**రంగారెడ్డి అర్బన్, మే 25, ప్రభాతవార్త:** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార మేళాలో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి తీసుకొచ్చిన పౌష్టికాహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించి రుచి చూశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు ఇలాంటి పోషకాహారాన్ని మరింత విస్తృతంగా అందించాలని సూచించారు. సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ధాన్యాలు, కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి ప్రతి వారం ఒక ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఇప్పటివరకు విజయవంతంగా కొనసాగించామని తెలిపారు. అదే ఉత్సాహంతో మహిళా వారోత్సవాలను కూడా విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణ మహిళల్లో పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించేందుకు అంగన్వాడీ టీచర్లు మరింత చురుకుగా పని చేయాలని కోరారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్వాడీల ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధక ఆహార పదార్థాలను అందిస్తున్నదని, పోషకాహార మేళా ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకుంటే అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని అన్నారు. ప్రతి


పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్

కుటుంబంలో మహిళలు, పిల్లలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం అత్యంత అవసరమని సూచించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ధిదారులు మరియు తల్లిదండ్రులతో వంటల పోటీలు నిర్వహించారు. తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో తయారుచేసిన పౌష్టికాహార పదార్థాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రత్యేక చార్టు ఏర్పాటు చేశారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్-ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, డిఆర్డిఓ, డిడబ్ల్యూఓ శ్రీలత, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, సీడీపీఓ శాంతి కుమారి, వివిధ ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హిందూ సమ్మేళనంలో త్రిదండి రామానుజ జీయర్ స్వామి

## సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

**కొత్తూరు మే 25, ప్రభాతవార్త :** కొత్తూరు మండల కేంద్రంలో విష్ణు చారి పర్యవేక్షణలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అహోబిలం శ్రీ త్రిదండి రామానుజ జీయర్ స్వామి అప్పల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ హిందూ సనాతన ధర్మ గొప్పతనం, భారతీయ సంస్కృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక విలువల ప్రాముఖ్యతపై విస్తృతంగా వివరించారు. హిందూ ధర్మాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, యువత ధార్మిక చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని. విజయవంతం చేశారు. భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రత్యేక పూజలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందూ సమైక్యత, సనాతన ధర్మ పరిరక్షణకు ఈ సమ్మేళనం వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## మండుటెండలోనూ.. ఆసరా కోసం

### క్యూకట్టిన పెన్షన్ దరఖాస్తుదారులు

**చిక్కడపల్లి మే 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో గల తహసీల్దార్ కార్యాలయాలు పెన్షన్ దరఖాస్తు దారులు, రెన్యువల్ కోసం వచ్చే లబ్ధిదారులతో కిక్కి రిసిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ల పునరుద్ధరణ (రెన్యువల్) చేసుకోవాల్సి రావడం, అలాగే కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండడంతో కార్యాలయాలన్నీ జనసందోహంగా మారాయి. అయితే, నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు గంటల తరబడి క్యూ లైన్లలో నిల్చోవలసి వస్తోంది. కనీస సౌకర్యాలు లేని చోట్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరుకు కసరత్తు చేస్తుండడం, పాత పెన్షన్ల బయో మెట్రిక్, ఐడెంటిఫి కేషన్ రెన్యువల్స్ తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తహసీ ల్దార్ కార్యాలయాలకు తరలివస్తున్నారు. నగరం లోని ముషీరాబాద్, అంబర్‌పేట్, నాంపల్లి, ఖైర తాబాద్, కుకట్‌పల్లి, సికింద్రాబాద్, హిమాయత్ నగర్ తదితర మండల పరిధిలోని కార్యాలయాల వద్ద తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆధార్ లింకింగ్, ఈకేవైసీ తదితర సాంకేతిక ప్రక్రియల కోసం వృద్ధులు, ఒంటరి మహిళలు రోజుల తర బడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షి  ణలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణో గ్రతలు 40 డిగ్రీలు దాటుతున్న వేళ, తహసీల్దార్ కార్యా లయాల వద్ద సరైన నీడ, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదా రులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. క్యూ లైన్లలో నిలబడలేక కొందరు వృద్ధులు చెట్ల కింద, కాంపౌండ్ వాల్స్ పక్కన సేదతీరుతు న్నారు. కళ్లెదుటే అవ్వాతాతలు ఎండకు ఎండిపో తున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

## కొత్త ఫింఛన్ల కోసం క్యూ..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 25, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు ప్రజావాణి కోసం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బారులు తీరా ప్రజలు విచ్చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 184ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈసారి ప్రజావాణిలో తమ సమస్యలను తెలియజేయటానికి ధరఖాస్తులు, వినతిపత్రాలు, ఫిర్యాదులు వంటివి జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. అయితే ఈ ప్రజావాణికి ఈ సోమవారం గత వారాల కన్నా ఈ సారి ప్రజలతో కలెక్టరేట్ ప్రాంగణంలో కిక్కిరిపోయింది. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ప్రజలు నమ్మకంతో వస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండ వెంటనే జాప్యం చేయకుండ వాటిని పరిశీలించి పరిష్కరించటానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తీసుకున్న చర్యలను వివరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అయితే ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులలో ఎక్కువగా డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం, కొత్త ఫింఛన్ల కోసం ధరఖాస్తులు ఉన్నట్లు, మిగతావా వివిధ శాఖలకు సంబంధించి ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ


మేడ్చల్ ప్రజావాణిలో బారులు తీరిన మహిళలు

అధికారి చంద్రావతి, జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

## బక్రీద్‌కు ఈద్గాను సిద్ధం చేయండి

**కొడంగల్, మే 25 ప్రభాతవార్త:** బక్రీద్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గా మైదానంలో మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం.గౌసన్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సి పల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌసన్ మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు ప్రార్థ నలు చేసుకునేందుకు వీలుగా ఈద్గా పరిసరాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని కోరారు. అలాగే జంతువుల వ్యర్థాలను సకాలంలో తొలగించేందుకు ప్రత్యేక సిబ్బందిని, వాహనాలను ఏర్పాటు చేయా లన్నారు. ప్రార్థన జరిగే ప్రదేశాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం చకలుగకుండా చూడాలని, పండుగ ప్రశాంతంగా ఆరోగ్యకరమైన వాతావారణంలో జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, ఆసీఫ్‌ఖాన్, మొహమ్మద్ సిరాజ్, సయ్యద్ హమీద్,షేక్ రుమాన్ తదితరులు పాల్గొన్నారు.



సిఎం, మంత్రుల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## రైతులు నష్టపోకుండా భూసేకరణ
### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి, మే 25, ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొందుర్గు -పరిగి-లక్ష్మీ మ్రదేవిపల్లి ప్రాజెక్టుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, రైతులు నష్టపోకుండా భూసేకరణ చేసి పరిగి ప్రాంత రైతులకు సాగునీరును అందించేలా ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణకు రూ.587 కోట్లు మంజూరు చేసినందున, సోమవారం పరిగి పట్టణం, కొడంగల్ చౌరస్తాలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రా మ్మో హన్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొందుర్గు-పరిగి-లక్ష్మీ మ్రదేవిపల్లి ప్రాజెక్టు కోసం పోరాటాలు చేసినా గత ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిం చిందని, ప్రాజెక్టు నిర్మిస్తె ఎంతో మంది రైతులకు సాగునీరు అందుతుందని ప్రాజెక్టు ప్రాముఖ్యతను ఆ ప్రాంతానికి తీసుకెళ్లి మంత్రులకు వివరించామని ఎమ్మెల్యే అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గంలోని దాదాపు 600 చెరువులను నింపుకోవచ్చని, తద్వారా రైతులు ఎక్కువ పంటలు పండిస్తారన్నారు. ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..రూ.587 కోట్ల నిధుల మంజూరుతో ప్రాంతీయ సాగునీటి అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, రైతాంగానికి ఇది ఎంతో మేలు చేసే నిర్ణయమని ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కిప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రజితవెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

## సేవలను గుర్తించి పదవులు కట్టబెట్టండి

**ఆమనగల్లు, మే25, ప్రభాతవార్త:** దశాబ్దాల కాలంగా పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి తమకు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టి సముచిత గౌరవం కల్పించాలని కల్వకుర్తి నియోజకవర్గ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. సోమవారం కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి వారు రాజధానిలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయిళ్ళ మాట్లాడుతూ తమ వినతికి సిఎం రేవంత్ సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి

## రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

**ఆమనగల్లు, మే 25, ప్రభాతవార్త:** గతంలో ఎన్నడూలేని విధంగా రైతుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. రైతును రాజుగా చేయాలనే ఆశయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. అంతేకాకుండా రాష్ట్రంలో రైతుభరోసా, రైతుబీమా, ఉచిత కరెంటు, సన్నాలకు బోనస్, పంటలకు మద్దతు ధరలు వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం వైస్ ఛైర్మన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గూడూరు యార్డు సంబంధించిన ఆదాయ ఖర్చుల వివరాలు వెల్లడించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల పీఏసిఎస్, ఐకేపిల ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధర కల్పించి రైతుల నుండి రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించినట్లు వివరించారు. మూడు మిల్లుల ద్వారా పత్తి 3,15 లక్షల క్వింటాళ్ళు, 2 కేంద్రాల ద్వారా 557 మంది రైతుల నుండి 70,260 బస్తాల మొక్కజొన్న 691 మంది రైతుల నుండి 35,965 క్వింటాళ్ళ వరిధాన్యం, 3వేల బస్తాల పొద్దు తిరుగుడు కొనుగోలు చేసినట్లు వివరించారు. అలాగే మార్కెట్‌యార్డుకు వచ్చిన ఆదాయంతో రూ. 14లక్షలతో రైతు గెస్టు హౌజ్, రూ. 12లక్షలతో సిసి ప్లాట్‌ఫారం, తాగునీరు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే రూ. 24లక్షలతో గోడౌన్ నిర్మాణం చేపడుతున్నట్లు వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాళ్ళ రవిందర్, వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్, నరేశ్‌నాయక్, జెల్లరమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## శ్రీవారి దేవాలయంలో ఘనంగా ప్రారంభమైన వసంతోత్సవం

**సైఫాబాద్, మే 25 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం వసంతోత్స వం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటలకు దేవాలయం లో వేద పండితుల మంత్రోచ్చరణలు, సన్నాయి మేళాల నడుమ అంకురార్పణ కార్యక్రమంతో వసంతోత్స వం ప్రారంభమైంది. అనంతరం అర్చకులు, పూ జారులు స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

# ఘణా'పూర్' రోడ్డుకో దండం!

★ హైవేకి దగ్గర మార్గం ★ నిత్యం భారీ ట్రాఫిక్ ★ యేళ్ల తరబడి రిపేర్లు లేవ్ ★ ప్రయాణం నరకప్రాయం ★ రాత్రి వేళల్లో తరచు ప్రమాదాలు ★ బెంబేలెత్తిపోతున్న వాహనచోదకులు



ఘణాపూర్-అన్నోజీగూడ రోడ్డు దుస్థితి

**ఘట్‌కేసర్, మే 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి లోని పలు రోడ్లు అభివృద్ధి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయి. ఘట్‌కేసర్, ఎదులాబాద్, పోచారం డివిజన్లను కలిపే ఘణాపూర్ రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకొక గుంతల మయంగా మారింది. అన్నోజీగూడ నుంచి ఓఆర్ఆర్ కిందుగా ఘణాపూర్ వెళ్లే రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈరోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు.

ఈరోడ్డుపై నిత్యం విద్యాసంస్థల బస్సులు, ఆటోలు, లారీలు వెళ్తుంటాయి. ఓఆర్ఆర్‌లోపల ఉన్న రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఈరోడ్డు మాత్రం మరమ్మతులకు నోచుకోక సంవత్సరాల గుంతలతో ప్రమాదకరంగా మారింది.

రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవు తున్నారు.

ఘణాపూర్, లింగాపూర్, ఫకీర్‌టెక్యా, రాజీవ్ గృహకల్పకాలనీ, ఎదులాబాద్, బొక్కోనిగూడకు రాకపోకలు సాగించేవారితో పాటు ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డుపై ప్రయాణించే వారు జాతీయ రహదారి చేరుకోవడానికి ఈరోడ్డు వీలుగా ఉంది. అయితే ప్రాధాన్యత కల్గిన రోడ్డును అభివృద్ధి చేయడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఎంఎంసి అధికారులు స్పందించి అన్నోజీగూడ-ఘణాపూర్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## అనధికార కోతల వాతలు!

### పది గంటల పాటు విద్యుత్ సరఫరా బ్రేక్
### ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
### తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు

**కొడంగల్, మే 25 ప్రభాతవార్త :** అసలే ఎండకాలం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లైన్ షిఫ్టింగ్, సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ పేరుతో విద్యుత్ సరఫరాను తరచు నిలిపివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కరెంటు లేకపోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు విలవిలలాడారు. సోమవారం మధ్యాహ్నం దాదాపు 2 గంటల పాటు విద్యుత్ కోత విధించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. విద్యుత్ కోతల ఫలితంగా కొడంగల్‌లోని పలు కాలనీల్లో తాగునీటి సమస్యకు అంతరాయం ఏర్పడుతోంది. కార్గిల్ కాలనీలో గత నెల రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మట్టి దందాను ఆపండి
### మంచన్‌పల్లి గ్రామస్తుల డిమాండ్



డిప్యూటి తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న మంచన్‌పల్లి గ్రామస్తులు

**పూడూరు, మే 25, ప్రభాతవార్త :** అక్రమాలు అరికట్టాల్సిన ప్రజా ప్రతినిధులే నిబంధలను ఉల్లంఘిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని పూడూరు మండలం మంచన్‌పల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమ వారం మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంచన్‌పల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 204లో లింగంగుట్ట అసైన్డ్ భూమిని సర్పంచ్ రాఘవేందర్, మాజీ సర్పంచ్ సత్యానారాయణరెడ్డి, పరిగి ఆత్మకమిటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అక్రమంగా తవ్వేసి మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గ్రామస్తులు పలుమార్లు నిలువరించినా తాత్కాలికంగా ఆపి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమదందాకు తెరతీస్తున్నారని వివరించారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడం సమంజసం కాదని మండిపడ్డారు. గత రెండు రోజులుగా ఈ విషయమై గ్రామస్తులు పూడూరు తహసీల్దారుతోపాటు, చెన్‌గోముల్ ఎస్ఐ, సంబంధితశాఖ అధికారులకు, 108 సిబ్బందికి పలుమార్లు సమాచారమిచ్చినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పూడూరు డిప్యూటి తహశీల్దారు వీరేష్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్‌పార్టీ నాయకులు రాంరెడ్డి, లక్కం సత్యనారాయణ, రమేష్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ డి అంజయ్య, గ్రామస్తులు కె.అంజయ్య, మల్లేశం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఉప సర్పంచ్ నరేష్

**కేశంపేట్, మే 25, ప్రభాతవార్త:** కేశంపేట మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్ల కలగా ఉన్న మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ భవనం మహిళల ఆర్థిక, సామాజిక పురోగతికి కేంద్రబిందువుగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్ కర్నెకోట నరేష్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి, పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇలాంటి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పామ్ వెంకట్రాం రెడ్డి, కొండేటి మాధవన్, కుమ్మరి అరవింద్, ఏయి నర్సింగ్ రావు, ఏపీఎం కవిత, సీసీ అలివేలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప్ పాల్గొన్నారు. అలాగే మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మమ్మ, కుమ్మరి శేఖర్, పోలే పోగు రాములు, కారోబార్ రాజు, రాము, వినోద్, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

**కుషాయిగూడ ,మే 25,ప్రభాతవార్త**

ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఓ పాస్పోర్ట్ సెంటర్ షెటర్లు పేలిపోవడంతో పాటు గది ధ్వంసమై ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిహెచ్ఎంసి కాప్రా గ్రామము చెందిన ఓ షెటర్లో మహేష్ అనే వ్యక్తి గత నెల రోజులుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను డిఎంకె పేరిట ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాడు. కాగా ఈనెల 24 ఆదివారం అర్ధరాత్రి వరకు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను నిర్వహించి రాత్రి ఒంటి గంట తర్వాత షెటర్ కు తాళాలు వేసి వెళ్లిపో యాడు. సోమవారం తెల్లవారుజామున సుమారు నాలుగు నుండి ఐదు గంటల ప్రాంతంలో పాస్పోర్ట్‌లో గల కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు పేలి పోవడంతో మంటలు ఎగిసిపడి షెటర్ సైతం పగిలిపోయి గది సైతం ధ్వంసం అవడంతో పాటు సెటర్లో గల పాస్పోర్ట్ పరికరాలన్నీ రోడ్డుపైకి ఎగిసిపడ్డాయి. ఈ క్రమంలో దారి గుండా వెళ్తున్న పరమేష్ అనే ఒక వ్యక్తికి మంటలు ఎగిసిపడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచా రం అందుకున్న కుషాయిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలు ఆర్పి తీవ్ర ప్రమాదం జరగకుండా అడ్డుకున్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు అప్రమత్తంగా ఉండండి
### -కార్యకర్తలకు కెటిఆర్ పిలుపు

**మూసాపేట, మే 25, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం ఎన్‌కేఎన్ ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మొదటగా మాట్లాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర్ రావు, మంత్రిగా కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. బాలానగర్, జేఎన్టీయూ, కైతలాపూర్ ప్రాంతా ల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, వాటర్ ట్యాం కులు, ఎస్టీపీ ప్లాంట్లు, డ్రైనేజీ వ్యవస్థలు, పార్కులు బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్మించిందని పేర్కొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు, ఓట్ల తొలగింపు ప్రక్రియ లో జరుగుతున్న అవకతవకలపై కార్యకర్తలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం అధికా రులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్‌గా రమేష్

**కొడంగల్, మే 25, ప్రభాతవార్త:** కొడంగల్ మున్సిఫ్ కోర్టులోని మండల్ లీగల్ సర్వీస్ అథారిటీకి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్‌గా న్యాయవాది కే.రమేష్ నియమితులైయ్యారు. ఈ మేరకు తెలంగాణా రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ (హైదరాబాద్) ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా రమేష్ నియామకం కావడం పట్ల కొడంగల్ కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

**కేశంపేట, మే 25, ప్రభాతవార్త :** వార్త ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం మానవాళి మనుగడను కాపాడుదామని సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో సోమవారం ప్లాస్టిక్ నిర్మూలనపై గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించి, 120 మైక్రాన్ కంటే తక్కువ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని సూచించారు. ఈ సందర్భంగా కిరాణా షాపులు, ఇతరత్రా షాపుల యజమానులను పిలిపించి ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మానవాళి జీవన విధానంపై ప్లాస్టిక్ ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు సయ్యద్ సలీమ్, పురుషోత్తం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

**ఆమనగల్లు, మే 25, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పీఏసిఎస్ నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక డీసిపి నారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏసీపి జానకిరెడ్డి, స్థానిక ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం ఆయన ఆమనగల్లు పట్టణంలో ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఈమేరకు కొనుగోలు జరుగుతున్న తీరు, రైతుల సమస్యలు, నిర్వహణ వంటి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రశాంతంగా ధాన్యం అమ్ముకుని మద్దతు ధరలు పొందాలని సూచించారు. అనంతరం రైతులకు కల్పించిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్ళ రవిందర్, పీఏసిఎస్ సీఈఓ పద్మాకర్‌రెడ్డి, మాజీ సీఈఓ దేవేందర్ ఉన్నారు.

## అమ్మ వానదేవుడో..
(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ శాఖ సిబ్బంది పరిస్థితిని సమీక్షించి మరమ్మతు పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు మరికొంత సమయం పట్టే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇక మాడ్గుల-ఆమనగల్ ప్రధాన రహదారిపై ఆవురుపల్లి సమీపంలో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానికులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెట్ల కొమ్మలను తొలగించే ప్రయత్నం చేశారు. అనంతరం అధికారులు జేసీబీల సహాయంతో చెట్లను తొలగించి రహదారిని పునరుద్ధరించారు. అదే విధంగా చంద్రాయణ్ పల్లి ఆమనగల్లు రహదారిలో పలుచోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్ స్థంబాలు నేలకొరిగి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గాలి వానల ధాటికి పలుచోట్ల చిన్నపాటి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు చెట్ల కొమ్మలు విరిగి ఇళ్లపై పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అయితే ప్రాణ నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు. మండల వ్యాప్తంగా జరిగిన పంట, ఆస్తి నష్టంపై అధికారులు పూర్తి స్థాయి అంచనాలు వేస్తున్నారు. ఈదురుగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.వరి ధాన్యం తడవడంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**ఆమనగల్లులోనూ ఈదురుగాలుల బీభత్సం**

**ఆమనగల్లు :** ఆమనగల్లు మండలంలో సోమవారం సాయంత్రం గాలి దుమారం భీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు పలు గ్రామాలలో చెట్లు నేలకూలాగా, పలువురు ఆస్తులకు తీవ్ర నష్టం చేకూరింది. ఒక్కసారిగా వీచిన గాలులకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా కొంత భయపడ్డారు. వృక్షాలు, విద్యుత్ స్థంభాలు కూడా నేల కొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగింది. మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళు గోడ కూలింది. రహదారిపై ఉన్న రేకుల డబ్బా కిరాణం షాపు పల్టి కొట్టింది. అలాగే శంకర్‌కొండతండాలో నలుగురికి చెందిన ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంటి రేకుల కప్పులు గాలికి ఎగిరిపోయాయి. మేడిగడ్డ ఉపసర్పంచు విజయ్‌రాథోడ్ హూటాహుటిన బాధితులను కలుసుకుని పరామర్శించారు.

## రాజధానిలో ఎండ .. వాన!

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:**

గత కొద్ది రోజులుగా ఎండ, వేడిమి, ఉక్కపోతతో సతమతమవుతున్న సిటీ ప్రజలకు కాస్తంత ఊరట లభించింది.. సోమవారం సాయంత్రం సిటీలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉన్నట్టుంది మబ్బులు కమ్ముకున్నాయి..వెంట వెంటనే వర్షం వాతావరణం చల్లబడటంతో ఎండ, వేడిమినుంచి ఉపశమనం లభించడంతో జనం పులకరించిపో యారు. సిటీలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో భారీవర్షం కురిసింది. పంజాగుట్ట, యూసుఫ్ గూడలో తేలిక పాటి వర్షం పండింది. మరోవైపు ఉప్పల్, రామంతాపూర్, ఎల్బీనగర్, ఫీర్జాదిగూడ, వనస్థలిపురం, నాగోల్ లలో మోస్తరు వర్షం పడింది. సిటీ శివారు ప్రాంతాలైన ఘట్ కేసర్, కీసరలో కూడా భారీ వర్షం కురిసింది.

## ఉరివేసుకుని నేపాల్ మహిళ ఆత్మహత్య

**హైదరాబాద్, మే 25 ప్రభాతవార్త :** బాగ్ అంబర్‌పేట్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో గల జీహెచ్ఎంసీ పార్కులో ఒక మహిళ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.మృతురాలిని నేపాల్‌కు చెందిన కాలా సావంత్‌గా గుర్తించారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఆమె తన భర్తతో జరిగిన గొడవ కారణంగా ఈ తీవ్రమైన చర్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

### గులాబీ పార్టీకి రాజకీయంగా ఫ్యూచర్ లేదని..
# ఫ్యూచర్ సిటీ వద్దంటే ఎలా!
### హరీష్ విమర్శలకు కాంగ్రెస్ నేత కేఎల్ఆర్ కౌంటర్

**మహేశ్వరం, మే25, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న విమర్శలను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ఖండించారు. తెలంగాణ యువతకు, భావితరాలకు ఉపాధి, విద్య, ఆధునిక జీవన వసతులు కల్పించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ముందుకు తీసుకెళ్తు న్నారని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావుకి, వారి పార్టీకి రాజకీయంగా ఫ్యూచర్ లేకపోవచ్చు. కానీ తెలంగాణ యువతకు, భావితరాలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలన్న సంకల్పంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. అందుకే ఫ్యూచర్ సిటీకి వ్యతిరేకంగా మాట్లాడటం పూర్తిగా ప్రజావ్యతిరేక ధోరణి అని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ ప్రాజెక్టుపై అప్పట్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని ఆయన గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఫార్మాసిటీ ప్రాజెక్టును నిలిపివేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న గ్రీన్ ఫార్మా, ఫ్యూచర్ సిటీ పూర్తిగా పర్యావరణహిత విధానాలతో రూపొందించబడిందని వివరించారు. ఇతర ప్రాంతాల్లో తయారయ్యే మందులు, వ్యాక్సిన్లను కేవలం రీఫిల్లింగ్, ప్యాకింగ్, నిల్వ వంటి కాలుష్య రహిత కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేసే విధంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అమలు చేయబోతోందన్నారు.



ఫ్యూచర్ సిటి ప్రయోజనాలను వివరిస్తున్న కేఎల్ఆర్

ఫ్యూచర్ సిటీ ద్వారా మహేశ్వరం ప్రాంతం అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి కేంద్రంగా మారబోతోందని కేఎల్ఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడ టంతో పాటు ఆధునిక నివాస సముదా యాలు, స్కిల్ యూనివర్సిటీలు, ఇంటిగ్రే టెడ్ పాఠశాలలు, ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ, అంతర్జాతీయ విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పడనున్నాయని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాల కంటే ప్రజల భవిష్యత్తును నిర్మించే రాజకీయాలకు తెలంగాణ ప్రజలు ఎప్పుడూ మద్దతు ఇస్తారని కేఎల్ఆర్ అన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి

## జనుము విత్తనాల పంపిణీ

**జిల్లెడు చౌదరిగూడ,మే 25,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ కేంద్రం ద్వారా రైతులకు సోమ వారం జనుము విత్తనాలను మండల వ్యవసాయఅధికారి రాజేందం రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు విత్తనాలు తీసుకువెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. మండ లానికి 300 బ్యాగుల జనుము విత్తనాలు వచ్చాయని వాటిలో 240బ్యాగుల జనుము విత్తనాలు రైతులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్

## కొలతల ప్రకారం పనులు చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ,మే 25,(ప్రభాతవార్త):** ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలు కొలతలప్రకారం పనులు చేయాలని టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం తుమ్మలపల్లి గ్రామం లో మాస్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాలను వినియోగించు కోవాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం ఫోటో క్యాప్చరింగ్ తప్పని సరిగా చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు ఉన్నారు.



## అంబలి కేంద్రానికి అపూర్వ ఆదరణ

క్లబ్ అధ్యక్షులు కె.గోవర్ధన్ రెడ్డి

**కడ్తాల్, మే 25, ప్రభత వార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్లు వారి ఆధ్వర్యంలో గత రెండునెలలుగా నిర్వహిస్తున్న అంబలి కేంద్రా నికి అపూర్వ ఆదరణ లభిస్తున్నట్లు అంబలి కేంద్రం పోగ్రాం కో ఆర్డినేటర్ మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు కె. గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న అంబలి కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రయాణ కులకు బాటసారిలకు పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఎండాకాలంలో జీవనోపాధి కూలీలుగా పని చేస్తున్న కార్మికులకు 120 మందికి అంబలిని అందజేశారు.అంబలి కేంద్రానికి సహకరిస్తున్న కడ్తాల్ లయన్స్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రతిరోజు 400 మందికి అంబలిని అందజేసినట్లు క్లబ్బు పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంప శీను,కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, పిఆర్ఓ పాషా, లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జనప మొక్కలతో అధిక దిగుబడి సాధ్యం!

వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి

**కొందుర్గు, మే 25, ప్రభాతవార్త :** వరి పంట సాగుచేసే పొలాల్లో జనప విత్తనాలను చల్లి మొక్కలు పెరిగిన తర్వాత దుక్కిలోనే దున్నితే ఎంతో సత్వ అయ్యి వరి పంట అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి అన్నారు.

సోమవారంనాడు స్థానిక వ్యవసాయ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆయన ప్రజాప్రతినిధులతో కలిసి జనుప విత్తనాల సంచులను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాలను వరి సాగు చేసే రైతులు మాత్రమే తీసుకెళ్లి దుక్కిలలో చల్లి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 40 కిలోల విత్తనాలు సుమారు మూడున్నర ఎకరాల వరకు చల్లాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దామోదర్ రెడ్డి, విండో సీఈవో మహమ్మద్ షరీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరు పురుషోత్తం రెడ్డి, విండో డైరెక్టర్లు జితేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు వాసవి, లక్ష్మీ మకాంత్, వెంకటేష్ తోపాటు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శ్రీరామాంజనేయ యుద్ధం వీధి నాటకం

**కొడంగల్,మే 25,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో గ్రామస్తుల అద్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామాంజనేయ యుద్ధం వీధి నాటకం ప్రదర్శన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ నాటకాన్ని వీక్షించడానికి అప్పాయిపల్లితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనాలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ వీధి నాటకంలో రామాంజనేయ చరిత్ర కండ్లకు కట్టినట్లు పాత్రదారులు ఆటపాటలతో ప్రదర్శించడం జరిగింది.ఈ వీధి నాటకంలో ఆట పంతులు సందయ ఏయాతి మహారాజు పాత్ర దారులు సర్పంచ్ బోడ్రాయి వెంకటయ్య,ఉపసర్పంచ్ పకీరప్ప, గ్రామస్తులు గోకుల్‌సింగ్,సంగప్ప,చంద్రయ్య అనంతయ్య, దత్తు సింగ్, కాశయ్యగౌడ్ పాత్రదారులు శ్రీనాద్‌సింగ్, బాలరాజ్‌గౌడ్, నారాయణ తదితరులు గ్రామస్తులు భారీ సంఖ్యలో వీధి నాటకాన్ని వీక్షించారు.


అప్పాయిపల్లిలో వీధి నాటకం ప్రదర్శన

# ఘనంగా హిందూ సమ్మేళనం

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీలోని డబిల్‌పూర్ గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాల నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా విచ్చేశారు. కాగా కార్యక్రమంలో ముందుగా యువకులతో కర్రసాము, మల్లయుద్ధం తదితర విన్యాసాలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న కుటుంబ వ్యవస్థ ప్రపంచంలో ఎక్కగా లేదని, హిందువు అంటే మతం కాదని, అది మానవ జీవన విధానం నేర్పించే పదమని అన్నారు. భారత దేశంలో పుట్టటం ఎన్నో జన్మల పుణ్యఫలమని, అందులో సమాజ హితం కోరే హిందువుగా ఉండటం గొప్ప విషయమని అన్నారు. నేడు ఇంట్లో మంచి చెడుల గురించి తల్లితండ్రులు చెప్పకపోవడంతో పిల్లలు పెడ దారినపడే అవకాశాలు అధికంగా ఉన్నాయని, ఇంటి నుంచే మంచి చెడుల గురించి చెప్పి రేపటి తరానికిపునాదులు వేయాలని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని, చెట్లు నాటి వాటిని సంరంక్షించాలని కోరారు. సమాజ హితంతో చెట్లును పెంచడమే కాకుండా వాతావరణ శుద్ధికోసం యజ్ఞహోమాలు జరిపాలని, ఆరోగ్య పరిరక్షణకు యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



డబిల్‌పూర్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో యువకులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమం

# మేడ్చల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియూ నాయకులు మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుదాంష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీగా ఉన్న మేడ్చల్ మున్సిపాలిటీగా రూపాంతరం చెంది ప్రస్తుతం ఇప్పుడు జిహెచ్‌ఎంసిలో విలీనమైనా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమని అన్నాడు. గ్రామపంచాయతీ వర్కర్లుగా, మున్సిపల్ కార్మికులుగా, ప్రస్తుతం జిహెచ్‌ఎంసి కార్మికులుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, జిహెచ్‌ఎంసి కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను మేడ్చల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశాడు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, 60 సంవత్సరాల వయస్సు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు, వారసులు లేని వారికి 15 లక్షలు ఇవ్వాలన్నాడు.కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కంచకపోతే ఉద్యమం చేపడుతామని అన్నాడు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సర్కిల్ కార్మికులు సిఐటియు నాయకులు వి.మల్లేష్, గణేష్, మల్లేష్, రవి, లక్ష్మారెడ్డి, మధు, సంతోష్, రాజు, శ్రీకాంత్, రాము, మహేష్, బిక్షపతి, శివ, లక్ష్మణ్, వెంకటయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

# తెలంగాణలో రెండవ అతిపెద్ద బ్యాంకుగా టిజిబి

..గ్రామీణాభివృద్దిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర కీలకం
..నాబార్డు తెలంగాణ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్
..తూంకుంటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభం
..పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**శామీర్‌పేట, మే 25,ప్రభాతవార్త:** తెలంగాణలో రెండవ అతిపెద్ద బ్యాంకుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు నిలిచిందని, గ్రామీణాభివృద్దిలో ప్రాంతీయ బ్యాంకుల పాత్ర కీలకమని నాబార్డు తెలంగాణ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం లోని తూంకుంటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను నాబార్డు తెలంగాణ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డిలు కలిసి ప్రారం భించారు.వారు జ్యోతి ప్రజ్వలనచేసి పూజలు నిర్వ హించారు. తూంకుంటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతనంగ 941వ బ్రాంచ్‌ను వారు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డు తెలంగాణ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో ఎస్‌బిఐ తరువాత స్థానంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులు సేవలు అందిస్తూ రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. తూంకుంట శాఖ బ్రాంచ్ ప్రారంభంతో నగరంలో టిజిబి శాఖలు 99కి చేరినట్లు తెలిపారు. అన్ని రకాల రుణాలను టిజిబి అందిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామిక వేత్తలకు సులభంగ రుణాలు అందించటమే లక్ష్యంగా టిజిబి ముందుకు వెళుతుందన్నారు. వ్యవసాయం, పశుపోషణ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు మైక్రోఫైనాన్స్ ద్వారా ఆర్థిక సాధికారత కల్పిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి కుసుమ్ పథకం కింద రైతులకు సోలార్ విద్యుత్ ప్యానెల్ల ఏర్పాటుకు రుణ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందించటానికి కొత్త శాఖలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ బ్యాంకు సేవలను మరింత పెంచుతూ అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం నాబార్డు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరస్పర సహకారంతో సమ న్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామీణ ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ బ్రాంచ్‌లో లాకర్ సౌకర్యం కూడ ఉందని అన్నారు. తూంకుంట నూతన బ్రాంచ్‌లో ఖాతాలు ప్రారం భించినట్లు, స్థానికులు ఖాతాలు తీసుకోవాలని టిజిబి బ్యాంకు సేవలు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్, ఎస్‌ఎంబికె విజేందర్, ఎస్‌ఎంఒ సత్యవేణి, తూంకుంట నూతన బ్రాంచ్ మేనేజర్ అజేష్‌కుమార్. సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించిన నాబార్డు తెలంగాణ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్, పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి,తదితరుల దృశ్యం

## ఘనంగా కట్టమైసమ్మ జాతర

**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త:** అలియాబాద్ గ్రామస్థులు శ్రీకట్టమైసమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతరను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొని పూజలు చేసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ జాతర అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగింది. దీనిలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు,భక్తులు పాల్గొన్నారు. పురస్కరించుకుని అలియాబాద్ గ్రామం నుంచి గ్రామ ప్రజలు, భక్తులు ఊరేగింపుగా శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని సాంప్రదాయ పద్దతిలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, శామీర్‌పేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మాజీ ఎంపిటిసిలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## గాజులరామారంలో ఆక్రమణల తొలగింపు

**జీడిమెట్ల, మే 25, ప్రభాతవార్త**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు పర్య వేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది భారీ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్‌కీ అపార్ట్‌మెంట్స్ నుంచి మహాదేవపురం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అనధికారిక షాపులు, తోపుడు బండ్లు, ఫుట్ పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించారు.ఈ మార్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతుం డటంతో పాటు కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని అన్నారు. మరోసారి ఎవరైనా రహదారులపై ఆక్రమణలకు పాల్పడితే వారి సామగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరిం చారు.

# వ్యర్థాల నిర్వహణ యూనిట్లు మాకొద్దు

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే శంకర్ వినతి

**షాద్‌నగర్, మే 25, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో త్వరలో ఏర్పాటు చేయబోతున్నారన్న ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు మాకొద్దు అని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేరుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం సాయంత్రం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ ప్రాంత ప్రయోజనాలు సురక్షితవ్యవహారా లపై ఉపముఖ్య మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. సిద్దా పూర్ గ్రామంలో ఉన్న సర్వే నంబర్లు 252, 278 మరియు 361 గల 33034 గుంటల ఎకరాల ప్రభుత్వ భూమిని, ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయ దం కోసం టీజీఐఐసీ ఇప్పటికే సేకరించినట్లు మీ దృష్టికి తీసుకువస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 సమీక్షా సమావేశంలో, షాద్‌నగర్ నియోజక వర్గంలోని కొత్తూరు మండలం, సిద్దాపూర్ గ్రామంలో ప్రభుత్వం ఒక ఎకో టౌన్ ను ఏర్పాటు చేయాలని ప్రతి పాదిస్తున్నట్లు ప్రకటించారని మా నియోజకవర్గ ప్రజల దృష్టికి వివిధ వార్తా నివేదికల ద్వారా వచ్చిందనీ పై వార్తల కారణంగా, సిద్దాపూర్ మరియు చుట్టుపక్కల గ్రామ ప్రజలు రీసైక్లింగ్ మరియు విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టుల పేరిట ఈ ప్రాంతంలో ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్లు, ద్రవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్లు, రీసైక్లింగ్ ప్లాంట్లు మరియు ఇతర సంబంధిత సౌకర్యాలను ఏర్పాటు చేయవచ్చనే తీవ్ర ఆందోళన మరియు భయాన్ని వ్యక్తం చేస్తు న్నారనీ ప్రజల మనోభావాలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తా రన్న అంశం సరైనది కాదని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇటువంటి కార్యకలాపాల వల్ల నీటికాలుష్యం, పర్యావరణ క్షీణత, ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తి, తద్వారా వ్యవసాయం, భూగర్భ జలాలు, స్థానిక నివాసితుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈకో టౌన్ కు బదులుగా, మొదట ప్రతిపాదించిన ఇండస్ట్రియల్ పార్క్‌నే కొనసాగించాలని సిద్దాపూర్ మరియు సమీప గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నారు. ఎందుకంటే, ఇండస్ట్రియల్ పార్క్ ప్రజలలో పర్యావరణ భయాలను కలిగించకుండా, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను మరియు పారిశ్రామిక అభివృద్ధిని కల్పిస్తుంది. పైన పేర్కొన్న ప్రజా ఆందోళనలు మరియు మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, సిద్దాపూర్ గ్రామంలో ఈకో టౌన్ ఏర్పాటు ప్రతిపాదనను దయచేసి పునఃపరిశీలించి, టీజీఐఐసీ మొదట ప్రతిపాదించిన విధంగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మిమ్మల్ని వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మొదట అందరూ భావించినట్టు ఈ ప్రాంతంలో ఇండస్ట్రీయల్ పార్క్ కు ప్రజలు సముచితంగా ఉన్నారని దంపింగ్ యార్డ్ మాత్రం ఎట్టి పరిస్థితిలో ఉందని ఎమ్మెల్యే కరాకండిగా ఉపముఖ్యమంత్రికి తెలియజేసినట్లు తెలిపారు.



## సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ప్రతీక : ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి మే 25 ( ప్రభాతవార్త ):** సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ప్రతీక అని శ్రీ వెంకటేశ్వర విశ్వవి ద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఎందరో మహాను భావులు మధుర స్మృతులలో భాగంగా సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా మారుతీ కళా వేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన సాహితీ వేత్త , పత్రికా రచయిత , ఉద్యమ కారులు సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది.

ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ సురవరం ప్రతాప రెడ్డి గోల్కొండ పత్రిక సంపాదకుడుగా తెలంగాణ సాయుధ పోరాటం లోనూ అనంతరం తొలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. రాజకీయాలకు అతీతంగా ఆయన అందరి అభిమానం పొందిన నిస్వార్థ నాయకుడని కొనియాడారు.

సభలో అభినందన సంస్థల కార్యదర్శి డాక్టర్ ఈ భవాని, సంఘ సేవకులు పిఎస్ఆర్. గాయని రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## బిజెపికి చిత్తశుద్ది ఉంటే రైతుల కొనుగోలు పరిమితి తొలగించాలి

ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి

**కుల్కచర్ల,మే25, ప్రభాతవార్త:** బిజెపి నేతలకు రైతులపై సిజమైన ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు పరిమితి తొలగించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బిజెపి తలపెట్టిన రైతు గోస బిజెపి భరోసాపై మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.బిజెపి చేపట్టినది రైతు గోస యాత్ర కాదని బిజెపి ఉనికియాత్ర అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన ప్రతి గింజను కొను గోలు చేస్తుందని రైతులకు ఎక్కడ లేని విధంగా రుణమాఫి,రైతు భరోసా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని రైతులకు అండగా నిలుస్తుందన్నారు.బిజెపి రైతులకు నల్ల చెట్టలు తెచ్చి అన్యాయం చేసిందని బిజెపి యాత్రలు రైతుల కోసం కాదు రాజకియ ఉనికి కోసమేనని విమర్శించారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి.పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,చౌడపూర్ మండల అధ్యక్షులు శేఖర్, మాజి అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళా ఓ వ్యాపారవేత్తగా ఎదగాలి

మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

**కొడంగల్,మే 25,ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా ఎదిగి, సొంతంగా వ్యాపారాలు చేసేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ తెలిపారు.సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు.సిఎం రేవంత్‌రెడ్డి మహిళా సాధికారత కోసం ప్రత్యేక నిధులు మంజూరీ చేస్తున్నారని,ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా ఓ వ్యాపారవేత్తగా ఎదగాలని పిలుప నిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు హమీద్,కుశగారి రాజశేఖర్,బత్తుల అనితనర్సింహ,సీఓ రాజేశ్వరీ,ఆర్పీలు అనందమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి ఎంచుకోవాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


హకా రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**కుల్కచర్ల,మే,25 ప్రభాతవార్త:** యువత స్వయం ఉపాధి అవకాశాలు ఎంచుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హకా రైతు సేవ కేంద్రానికి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..నిరుద్యోగ్య యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,చౌడపూర్ మండల అధ్యక్షులు శేఖర్, మాజి అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
పోటో:

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ

**కొడంగల్,మే 25,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.సోమవారం సర్పంచ్ రాధశ్రీనివాస్ అద్వర్యంలో గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు గొల్ల గోవిందమ్మ,కొడంగల్ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సమక్షంలో నిర్వహించిన మహిళా సమాఖ్య భవన నిర్మాణం భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ హాజరై భూమిపూజతో నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి సిఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని,ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,ఎంపీడీఓ ఉషశ్రీ,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ వితంతువుకు జీవనాధారం

బాలాజీనగర్‌లో కిరాణా షాపు ప్రారంభం

**జవహర్‌నగర్,మే 25,ప్రభాత వార్త:** సామాజిక సేవలో ముందుండే సుఖినోభవంతు ట్రస్ట్ మరియు పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ సేవా తత్వాన్ని చాటుకున్నాయి. జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చంద్రపురి కాలనీ, బాలాజీనగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద దివ్యాంగ వితంతువు వరలక్ష్మికి స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రూ.20 వేల విలువైన కిరాణా సామగ్రిని అందించి కిరాణా షాపును ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ ఈ విషయాన్ని ట్రస్ట్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో సుఖినోభవంతు ట్రస్ట్ సభ్యులు సత్యవతి, వెంకటరమణ, బలగం టీవీ విజయ్ కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిసిపి

**తలకొండపల్లి ,మే 25,ప్రభాత వార్త:** తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను మహేశ్వరం డిసిపి కె. నారాయణ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నమోదులు, పెండింగ్ కేసుల వివరాలు, సిసి కెమెరాల పనితీరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలు, ఫిర్యాదుల స్వీకరణ విధానంపై మరియు రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మహిళల ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా క్రమశిక్షణతో సేవ లందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎసిపి ఎస్. జానకి రెడ్డి, ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ కె. శేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రిని కలిసిన పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ చైర్మన్

**మాడ్గుల,మే25,ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను ఇటీవల నియమితులైన తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని గ్రామపంచాయతీల పరిపాలన, స్థానిక సంస్థల వ్యవహారాలు, ట్రిబ్యునల్ బాధ్యతల నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.తెలంగాణ గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూదిని రాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా, నిష్పాక్షికంగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.గ్రామస్థాయి పరిపాలన బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామపంచాయతీలకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో ట్రిబ్యునల్ కీలకపాత్ర పోషించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా సీఎం వివరించినట్లు సమాచారం.

## రూ. 10 లక్షలతో డ్వాక్రా భవన నిర్మాణానికి భూమి పూజ

**ధారూర్, మే 25, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని ఆవుసుపల్లి, ధర్మపూర్ గ్రామాల్లో డ్వాక్రా భవన నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన జరిగింది. మహిళా సంఘాల బలోపేతం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 10లక్షల నిధులతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మహేశ్ కుమార్, అనిల్ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, ఎంపిడిఓ నర్సింలు, ఎంపిఓ సఫీ ఉల్లా ఖాన్ ప్రత్యేకంగా పాల్గొని సర్పంచ్‌లతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఈ నిధులను కేటాయించిందని, భవన నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే డ్వాక్రా మహిళల సమావేశాలకు, ఇతర కార్యకలాపాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని స్థానిక సర్పంచ్‌లు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## "రైతు గోస ...బిజెపి భరోసా" రాజకీయ డ్రామా

**వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాదవ్ ధారసింగ్ నాయక్**

**వికారాబాద్, మే 25, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లాలో బిజెపి చేపట్టిన "రైతు గోస – బీజేపీ భరోసా" కార్యక్రమం పూర్తిగా రైతులను, ప్రజలను మోసం చేసే రాజకీయ డ్రామా అని,రైతులను మోసం చేసే యాత్ర అని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాదవ్ ధారసింగ్ నాయక్ విమర్శించారు.కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడానికి మాత్రమే ఉందని కొనుగోలు చేయడానికి లేదన్నారు.రైతులు పండించిన పంటలను కేంద్రం 52లక్షల టన్నుల కొనుగోలు అని పరిమితి పెట్టి రైతులను మోసం చేస్తుందని ,బిజెపి నాయకులు రైతుల దృష్టి మళ్లించేందుకే యాత్రలు చేస్తున్నారని ధారాసింగ్ తెలిపారు.యాత్రలు మానేసి రైతు కష్టాలను తొలగించే దిశగా కేంద్రం పనిచేయాలని,తెలంగాణ రైతులు పండించిన ప్రతి గింజను కేంద్రం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలే రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఎరువులు, డీజిల్, విత్తనాల ధరలు పెంచి రైతులపై ఆర్థిక భారం మోపి,రైతుల కోసం పోరాటం చేస్తున్నట్లు బిజెపి నాయకులు నటిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగానికి ఇవ్వాల్సిన నిధులు, పంట బీమా, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని ఎందుకు తగ్గించిందో ముందుగా సమాధానం చెప్పాలని బిజెపి నాయకులను డిమాండ్ చేశారు.రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు రుణాలను మాఫీ చేసి, ఎరువులు, డీజిల్ ధరలు తగ్గించాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టాకే రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ధారాసింగ్ స్పష్టం చేశారు.

## మహిళా సంఘాల భవన నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయాలి

**దౌల్తాబాద్,మే 25,ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలంలోని దేవర్‌ఫస్లావాద్,నాగసార్ గ్రామాల్లో సోమవారం రోజు మహిళా సంఘాల భవన నిర్మాణ పనులకు స్థానిక సర్పంచులతో కలిసి అధికారులు ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి ఈ భవనాలు ఎంతగానో దోహద పడతాయని ,నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఇ సురేష్‌బాబు,ఎఇనాగేందర్,ఎంపిడిఓ శ్రీనివాస్, దేవర్ ఫస్లావాద్ సర్పంచ్ కూర రాజు,నాగసార్ సర్పంచ్ అరుణమ్మ,ఎపిఎం వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు

**..రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న వైనం**

**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త:** అలియాబాద్‌లో ఉన్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిజెపి నాయకుల బృందం సందర్శించింది. సోమవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా బిజెపి కిసాన్‌మోర్చ అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్‌ల ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవతవకలు జరుగుతున్నట్లు పరిస్థితిని బట్టి స్పష్టం అవుతుందని బిజెపి నాయకులు అన్నారు. వరి కొనుగోలు కేంద్రానికి సంచులు, సుతిలిదారాలు, అమాలీలు వీటికి సంబంధించిన డబ్బులు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రైతులకు నోడల్ ఎజెన్సీగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. రైతాంగంకు క్వింటాలుకు 5కిలోల చొప్పున వడ్లను తగ్గించి తీసుకోవటం జరుగుతుందన్నారు. సకాలంలో వడ్లను రైతుల నుంచి తీసుకోకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను తెలుసుకుని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు లేకుండ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే బిజెపి ఆధ్వర్యంలో ముట్టడిస్తామన్నారు. సంబంధిత అధికారులు పర్యటించి రైతుల ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్ కైర గణేశ్, మాజీ సర్పంచు ఎం.రోజారాణిఅశోక్, మాజీ అధ్యక్షులు కైర యాదగిరి, బిజెపి నాయకులు ఇ.బ్రహ్మానందరెడ్డి, గౌరారం రమేశ్, ఎం.మహేశ్, సిహెచ్ వెంకటేశ, ఎస్టీ మోర్చ మున్సిపల్ అధ్యక్షులు భీమానాయక్, నాయకులు మన్నె శ్రీశైలంయాదవ్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**షాద్‌నగర్, మే 25, ప్రభాతవార్త :** తన వార్డులో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తన ఆహ్వానించకుండా అవమానించి విస్మరించారని ప్రోటోకాల్ నిబంధనను పాటించలేదని ఆరోపిస్తూ షాద్ నగర్ పట్టణంలోని 11 వ వార్డు బిఆర్‌ఎస్ మహిళా సభ్యురాలు పిల్లి సరదా శేఖర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అదేవిధంగా అదనపు కలెక్టర్లకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ జిల్లా కలెక్టర్ ను కలుసుకొని ఫిర్యాదు పత్రాన్ని అంద జేసినట్లు మీడియాకు ప్రకటన విడుదల చేశారు ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు. తన వార్డు పరిధిలో హెచ్‌ఎండిఏ నిధులతో అంగన్వాడీ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన కార్య క్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తది తరులు వచ్చారని ఈ కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటించకుండా తనకు సమాచారం ఇవ్వలేదని కార్యక్రమానికి ఆహ్వా నించలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే వార్డు పరిధిలోకి ఈ పనులు రావు అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని శారద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.



కలెక్టరేట్లో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్

# పట్టుబడితే జైలుకే..

- డ్రగ్స్ విక్రయాలపై మొయినాబాద్ పోలీసుల ఉక్కుపాదం..
- అజీజ్‌నగర్ చౌరస్తాలో డాగ్ స్క్వాడ్ ఈగల్ టీంతో కలిసి విస్తృత తనిఖీలు..
-పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు..
- డ్రగ్స్ విక్రయించినా.. ఆశ్రయం కల్పించినా కఠిన చర్యలు తప్పవు..
-సిఐ మల్లికార్జున రెడ్డి



**మొయినాబాద్, మే 25, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలో డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు."మాదకద్రవ్యాలు విక్రయించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.. పట్టుబడితే నేరుగా జైలుకే పంపిస్తాం" అని మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు.సోమవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో నేర నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు కలిసి పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి.ఈ సందర్భంగా దుకాణ యజమానులకు పోలీసులు ప్రత్యేక అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాలు విక్రయించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సీఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా మొయినాబాద్ మండల పరిధిలో ఇంజనీరింగ్ కళాశాలలు అధికంగా ఉండడం, ఫామ్ హౌస్ కల్చర్ వేగంగా విస్తరిస్తుండడంతో చిన్న సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రజలు, వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.హోటళ్లకు వచ్చే కస్టమర్లలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాలు వినియోగిస్తున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీల్లో ఎస్సై వెంకన్న, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, ఈగల్ టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టు రెస్టారెంట్‌లో టేబుల్‌పైకి ఎక్కి ఆహారం తిన్న శునకం

**-అధికారుల నిర్లక్ష్యం పట్ల ప్రయాణికులు అసంతృప్తి**
**-ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం**
**-ఎయిర్‌పోర్టు నిర్వాహకులు**

**రంగారెడ్డి అర్బన్ మే 25,ప్రభాతవార్త :** శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఓ రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి ప్రయాణికులు భోజనం చేసిన అనంతరం మిగిలిపోయిన ఆహారాన్ని టేబుల్‌పై వదిలేసి వెళ్లారు.ఈ క్రమంలో ఓ శునకం టేబుల్ పైకి ఎక్కి తిన్నాడంతో కొందరూ ప్రయాణికులు ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఈ వీడియో వైరల్ అవ్వడంతో వెలుగులోకి వచ్చింది.ఈ సందర్భంగా ఓ అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో అధికారుల నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై స్పందించిన నిర్వాహకులు వన్యప్రాణుల నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసే భాగంగా, మేము అనాథ కుక్కల నియంత్రణకు జిహెచ్‌ఎంసితో సన్నిహిత సమన్వయంలో పనిచేస్తున్నామని ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో జిహెచ్‌ఎంసి బృందాలు క్రమం తప్పకుండా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయని 2026 జనవరి నుంచి ఇప్పటివరకు 21 అనాథ కుక్కల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.అదనంగా, అన్ని సేవలందించే సంస్థల వద్ద కఠినమైన వ్యర్థాల నిర్వహణ విధానాలను మరింత కట్టుదిట్టం చేశామని ఇందులో మూత ఉన్న డస్ట్‌బిన్‌లలో తప్పనిసరిగా వ్యర్థాలను పారవేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రౌండ్ స్థాయి సిబ్బందికి అప్రమత్తతను పెంపొందించేలా సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు నివారణ చర్యలను చురుకుగా అమలు చేయాలని సూచనలు చేసినట్లు తెలిపారు.

## కాలం కన్నెర్ర చేసింది..
# కళాకారుడి ఇల్లు కాలిపోయింది

**షాబాద్, మే 25, ప్రభాతవార్త :** కటిక పేదరికంలో పుట్టి, కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటూనే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన కళాకారుడు తూర్పాటి వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కవి, గాయకుడు నేర్నాల కిషోర్ కోరారు. షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడా గ్రామానికి చెందిన కళాకారుడు తూర్పాటి వెంకటేష్ నివాసం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన నేపథ్యంలో సోమవారం నేర్నాల కిషోర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ కళాకారుల పట్ల ప్రజా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి స్పందించి తూర్పాటి వెంకటేష్ కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని కోరారు.



దగ్ధమైన వెంకటేష్ ఇల్లును పరిశీలిస్తున్న నేర్నాల కిషోర్, తదితరులు

అలాగే బాధిత కళాకారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, తెలంగాణ ఉద్యమ కళాకారులు గ్యార యాకన్న, పొన్నాల విష్ణు, కొడముంజ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**బాలికపై లైంగిక దాడి కేసులో**
# తండ్రికి 20 ఏళ్ల జైలు

**షాబాద్, మే 25, ప్రభాతవార్త :** కన్నకూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి పోక్సో ప్రత్యేక కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను షాబాద్ పోలీసులు వెల్లడించారు. షాబాద్ మండలం కుర్వగూడ గ్రామానికి చెందిన దాదే రాజు (37)పై ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెం.303/2024 (బి ఎన్ ఎస్) సెక్షన్లు 65(1), 64(2)(ఎఫ్), 351(2)తో పాటు పోక్సో చట్టం 2012లోని 5(1)(ఎన్) రెడ్‌విత్ 6 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 2024 అక్టోబర్ 12న బాధితురాలి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తన సొంత తండ్రే బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని పోక్సో కేసుల ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి. శ్రీనివాస్, నిందితుడు దోషి అని తేల్చి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం మంజూరు చేశారు. ఈ కేసులో సమర్థవంతమైన వాదనలు వినిపించిన ఎపిపి వి. భిక్షపతి గౌడ్, కోర్టు సిబ్బంది ఎం.డి. అనీఫ్, హెచ్‌జి వి. ప్రభాకర్, లైజనింగ్ అధికారి వాసి అలివేలు, అలాగే షాబాద్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని ఉన్నతాధికారులు అభినందించారు.

## గ్రామాభివృద్ధికి కొత్తదిశ

**మల్లారెడ్డి గూడలో విలేజ్ ఆర్గనైజేషన్ భవనం పూజా కార్యక్రమంలోసర్పంచ్**

**షాబాద్, మే 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలతో గ్రామాభివృద్ధికి కొత్త దిశ ప్రారంభమైందని మల్లారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా సోమవారం మల్లారెడ్డి గూడ గ్రామంలోని వి.ఓ భవనం వద్ద పూజా కార్యక్రమాన్ని సర్పంచ్ అమీర్పేట్ సబిత గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే విలేజ్ ఆర్గనైజేషన్ భవనం ఏర్పాటు త్వరలో పూర్తికానుంది అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మందుగుల మాణిక్యం, వార్డు సభ్యులు బుదారం అనూష, బుర్ర దివ్య, రంగంజ్యోతి, పంచాయతీరాజ్ ఎఇ ఆశాజ్యోతి, వర్క్ ఇన్స్పెక్టర్ శివ, మహిళా సంఘం సిసి బాలరాజు, మహిళా సంఘ సభ్యులు, వి.ఓ.ఏ అమీర్పేట్ జ్యోతి, లక్ష్మమ్మ, పుష్పమ్మ, సురేఖ, సునీత, సుజాత, పావని, మంజుల, రాములమ్మ, బాలామణి, సత్యమ్మ, శ్యామలమ్మ, చిన్నమ్మ, పద్మమ్మ, గ్రామ పెద్దలు పెంటయ్య, సత్తయ్య, అంజిరెడ్డి, ఒగ్గు సిద్దార్థ, పెదేటి గణేష్, బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు జనుము విత్తనాలకొరకు పర్మిట్‌లు

**ఎఒరామకృష్ణారెడ్డి**

**మోమిన్‌పేట్, మే 25. ప్రభాతవార్త:** మోమిన్‌పేట మండల పరిధిలోని మోమిన్‌పేట్, మేకవనంపల్లి, వెల్‌చాల్, కేసారం, టేకులపల్లి రైతువేదికలలో రైతులకు జనుము విత్తనాల కొరకు పర్మిట్ లు ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మిడియాతో మాట్లాడుతు మంగళవారం ఉదయం 10,గంటలనుండి ఆయా రైతు వేదికలలో క్లస్టర్ అధికారులు జనుము విత్తనాల పర్మిట్‌లు వ్రాసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇట్టి పర్మిట్‌లు పొందిన రైతులు మోమిన్‌పేట్ డిసిఎంఎస్ ఆర్‌ఎస్‌కేలో తీసుకోవచ్చునని, కనుక విత్తనాలు కావలసిన రైతులు తమ తమ భూమి పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావలెనని కోరారు. 2,రెండెకరాల పైన ఉన్న రైతులకు పర్మిట్ ఇవ్వడం జరుగుతుందని ఏఓ తెలిపారు. ఎందుకనగా జనుము ఒక ఎకరానికి 15 కిలోలు వేసుకోవలెను, మరియు భూమి సర్వే నెంబర్లు ఎలాంటి సమస్య లేకుండా అనగా కోర్టు కేసు, వక్స్‌బోర్డు,నాన్ డిజిటల్ పాసు బుక్కులు తీసుకొని రావాలని ఏఓ సూచించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో నెల తర్వాత రిజిస్ట్రేషన్ అయిన కొత్త భూమి పట్టాపాస్ బుక్ కూడా ఇవ్వడం జరుగదని ఆయన తెలిపారు.

# కిషోరబాలికలకు పోషక విలువలతో ఆహారం అందించాలి

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మే 25, ప్రభాతవార్త:**

కిషోర బాలికలకు పోషక విలువలతో ఆహారంను అందించాలని, ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని మహిళా సమాఖ్యలో జిల్లా మహిళా,శిశు సంక్షేమ వారోత్సవాలను చైర్మన్ జాము రవి ప్రారంభించారు. అదే విధంగా అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాల్టీల్లో కూడ జిల్లా మహిళా, శిశు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభించటం జరిగింది. దీనిలో కుకింగ్ పోటీలు, మెడికల్ హెల్త్ చెకప్‌లపై అవగాహన కార్యక్రమాలను ఆయా చోట్ల నిర్వహించారు. పోషక ఆహారం, ఆరోగ్యపరిరక్షణ, పరిశుభ్రతలకు సంబంధించి పాటించటంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగ మూడుచింతలపల్లి మున్సిపల్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ కిషోర బాలికలకు ఆహారం పోషక విలువలతో కూడినది అందించటానికి, ఆరోగ్య పరిరక్షణకు, వ్యక్తిగత పరిశుభ్రతపై అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించాలని, ఆహారం ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన జీవనశైలిని, పోషకహారం అవసరం గురించి సంబంధిత అధికారులు వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారం వంటకాల కార్యక్రమంలో ఉతానసహంగా పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణీస్త్రీలు, బాలింతలు, బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం, ఇతర పౌష్టికాహారం పదార్థాల ప్రాముఖ్యతపై తెలియజేశారు. వైద్య సిబ్బంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లిలో జిల్లా స్థాయిలో మహిళా శిశు సంక్షేమ వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, జిల్లా సంక్షేమ అధికారి శారద, పాల్గొన్న మహిళల, తదితరుల దృశ్యం



## పవర్ బోర్‌లకు మరమ్మతులు జరిపించండి

**సికింద్రాబాద్, మే 25 ప్రభాతవార్త:** పార్సిగుట్ట అంబర్‌నగర్ ఎల్ నారాయణ నగర్ బస్తీలలో గత అనేక నెలలుగా పవర్ బోర్లు, చేతి పంపులు పాడైపోయి నిరుపయోగంగా మారాయి వాటిని తక్షణమే మరమ్మతులు జరిపించాలని మాజీ కార్పొరే టర్ పి. స్వరూపాగౌడ్ అధికారులను కోరారు. పాడైపోయిన పవర్ బోర్‌లను అధికారులకు చూపించారు. అధికారులు వాటి ని వెంటనే మరమ్మతులు జరుపడం కోసం ఏర్పాట్లు చేస్తు న్నట్లు తెలిపారు. అలాగే మహ్మద్‌గూడ నాలలో చాలా కాలంగా చెత్త నిలువలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వ్యాపి స్తోందని, దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని అమే తెలిపారు. కార్యక్రమంలో రవి ప్రసాద్ గౌడ్, ఓములు, బబ్లు, నాని, బాలయ్య గుప్తా, రాజు, శ్రీను పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యానికి ఎక్కువ ధర చెల్లిస్తాం

**షాద్‌నగర్, మే 25, ప్రభాతవార్త :** షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసే విధంగా పూర్తిస్థాయిలో పాలకవర్గం చర్యలు తీసుకోవడం జరిగిందని షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితర డైరెక్టర్లు స్పష్టం చేశారు. సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు మార్కెట్ యార్డును ప్రత్యేకంగా పరిశీలించారు.షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి, షాద్ నగర్ మార్కెట్ యార్డునకు నేడు 294 మంది రైతులు దాదాపు 30,000 ధాన్యము బస్తాలను మార్కెట్ యార్డునకు తీసుకురావడం జరిగినదని వారు తెలియజేశారు. ఆకాల వర్షము కారణముగా మార్కెట్ యార్డునకు వచ్చిన ధాన్యము పాక్షి కముగా తడిచిపోవడం వల్ల ఇట్టి తడిచిపోయిన ధాన్యమును కొనుగోలు దారులు కొనక పోవడంతో పాలకవర్గము ఇట్టి విషయమును తెలుసుకొని రైతులు నష్టపోవద్దనే ఉద్దేశ్యముతో పాలకవర్గం మార్కెట్ యార్డులో పర్యటించి దీనిపై ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నట్లు మీడియాకు ప్రకటించారు. పాలక కమిటీ సభ్యులు టి.కరుణాకర్, ఎల్. భరత్, టి. సందీప్, టి.నవీన్ కుమార్ మార్కెట్ కమిటి సెక్రటరి ఎన్.శ్రీనివాస్ తదితర బృందం కమీషన్ ఏజెంట్లతో మరియు కొనుగోలు దారులతో సమావేశమును ఏర్పాటు చేసి మార్కెట్ యార్డులో పాక్షి కముగా తడిచిపోయిన ధాన్యమును పూర్తిగా ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికముగా అనగా పచ్చి ధాన్యమునకు రూ . 2400 మరియు ధాన్యము తడవకుండా తేమ తక్కువగా వున్న ధాన్యమునకు రూ.2600 లకు రైతులకు చెల్లించుటకు గాను నిర్ణయించి కొనుగోలుదారులచే కొనుగోళ్ళను పూర్తి చేయించడం జరిగినదని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, మహబూబ్ తదితరులు ఉన్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో చిన్న కష్టం కూడా రానివ్వమని వచ్చిన ఎదుర్కొనే సత్తా ప్రభుత్వానికి ఉందని తెలిపారు. రైతులను ఉసిగొలిపి రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతుల కష్టాలు తమకు తెలుసని రైతులను పూర్తిగా ఆదుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, షాద్ నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో రైతులకు బాసటగా నిలుస్తామని వారు ప్రకటించారు.ఈ సమావేశములో వ్యాపారస్థులు, కమీషన్ దారులు మరియు రైతులు పాల్గొనడం జరిగినది.



మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

..డ్రైవర్ దుర్మరణం..మరో ఇద్దరికి తీవ్రగాయాలు
..నిలబడి ఉన్న లారీ (కాంటినైర్)ని వెనక నుంచి ఢీకొన్న డిసిఎం వ్యాన్

# ఒఆర్‌ఆర్‌పై ఘోరరోడ్డు ప్రమాదం



**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త:**

శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డిసిఎం వ్యాన్ డ్రైవర్ అక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై నిలబడి ఉన్న కంటినైర్ లారీని వెనక నుంచి డిసిఎం వ్యాన్ ఢీకొనటంతో వ్యాన్ క్యాబిన్ దెబ్బతినటంతో పాటు అందులో డ్రైవర్ ఇరుక్కుపోవటంతో బయటకు తీయటానికి కొంత ఇబ్బందిగా మారి ఎట్టకేలకు పోలీసులు మృతిచెందిన డ్రైవర్ రవి మృతదేహాన్ని బయటకు తీశారు. సోమవారం శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డు వద్ద ఈ రోడ్డు ప్రమాద సంఘటన జరిగింది. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ కథనం ప్రకారం ఘట్‌కేసర్ నుంచి డిసిఎం వ్యాన్ ఇంటి సామాగ్రిని నింపుకుని మేడ్చల్‌కు వెళ్లటానికి ఔటర్ రింగురోడ్డుపై బయలు దేరింది. అయితే శామీర్‌పేట ఓఆర్‌ఆర్ వద్దకు చేరుకోగా ఓఆర్‌ఆర్‌పై ఓ లారీ (కంటినైర్) నిలిపి ఉండటం, నిలిపి ఉన్న దాన్ని వెనక నుంచి డిసిఎం వ్యాన్ వస్తూ దాన్ని ఢీకొనటంతో డిసిఎం వ్యాన్ క్యాబిన్ పూర్తిగ నుజ్జు,నుజ్జు కావటంతో డ్రైవర్ రవి దానిలోనే ఇరుక్కు పోయి మృతిచెందినట్లు తెలిపారు. ముందు భాగంలో కూర్చున్న మరో ఇద్దరికి తీవ్రగా గాయాలు అయినట్లు తెలిపారు. మరో ముగ్గురు కూలీలు వెనకాల కూర్చుని ఉన్నట్లు తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో డిసిఎం వ్యాన్ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో బయటకు తీస్తున్న పోలీసుల,తదితరుల దృశ్యం